# కేసీఆర్‌తోనే గ్రామాలు సుభిక్షం

- కాంగ్రెస్‌వి దిగజారుడు రాజకీయాలు
- అధికారం కోసం మోసపూరిత హామీలు
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నందనాయక్‌తండా నాయకులు



గీసుగొండ మండలం నందనాయక్‌తండా కాంగ్రెస్ యూత్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుగొండ, అక్టోబర్ 19: సీఎం కేసీఆర్ పాలనలోనే గ్రామాలు సుభిక్షంగా ఉన్నాయని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని నందనాయక్‌తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకులు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో గురువారం హనుమకొండలోని చల్లా నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి సాధించాయన్నారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. యువకులు, మేధావులు, రైతులు, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. ప్రజా సంక్షేమ కోసం పని చేస్తున్న ప్రభుత్వాలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలను ఇస్తున్నదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇక్కడ ప్రకటించిన పథకాలను ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం దిగజారుడు రాజకీయాలు చేయొద్దని కోరారు.

**రాష్ట్రంలో పటిష్ట పోలీస్ వ్యవస్థ**

దేశంలో ఎక్కడా లేని పోలీస్ వ్యవస్థ తెలంగాణలో ఉందని ఎమ్మెల్యే చల్లా అన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని వివరించారు. అల్లకల్లోలం సృష్టించే కాంగ్రెస్ పార్టీ మనకెందుకని, కులమతాల గురించే మాట్లాడే బీజేపీని పట్టించుకోకుండా ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పని చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ప్రతి కార్యకర్తకూ తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జూలూరి లెనిన్‌గౌడ్, నాయకులు వీరన్న, రవీందర్, వెంకటేశ్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో గిరిజన సంఘం గ్రామ అధ్యక్షుడు బదావత్ వెంకన్న, కాంగ్రెస్ గ్రామ నాయకులు భూక్యా శ్రీనివాస్, భూక్యా సుమన్, యూత్ నాయకులు అజ్మీరా వీరన్న, శ్రీనివాస్, బానోత్ సుమన్, బదావత్ బాలరాజు, బానోత్ రాహుల్, తిరుపతి, శ్రీను, విజయ్ తదితరులు ఉన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే..
- దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ
- నర్సంపేటకు అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, అక్టోబర్ 19: రాష్ట్రంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 23 వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు, 12 వార్డు నుంచి కాంగ్రెస్‌కు చెందిన 43 కుటుంబాలు నర్సంపేటలో గురువారం బీఆర్ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులకు పెద్ది గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల కాలంలో ఇంటింటికీ పథకాలు వచ్చాయని తెలిపారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఏదో ఒక పథకం పొందుతున్నారని చెప్పారు. లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. గతంలో ఎంతో వెనుకబడిన తెలంగాణను పదేళ్ల కాలంలోనే సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నర్సంపేటకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. నర్సంపేట పట్టణంలో జిల్లాస్థాయి ఆస్పత్రి, మెడికల్ కళాశాల, నల్లబెల్లి మండలంలో హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్, గోదాముల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులకు నిధులు అందించారని వెల్లడించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఎస్కె యాకూబ్‌పాషా, ఎండీ మహ్మద్‌పాషా, సుభాన్ అలీ, రఫీ, వహీద్, కైసర్, వహీద్, చాంద్‌పాషా, గౌస్, రబ్బానిపాషా, ఖాజాపాషా, ఫాయాజ్, అయూబ్, ఫిరోజ్, ముస్తాక్, రసూల్‌బాయ్, బోలేషా, యాకూబ్‌పాషా, కైసర్, సలీం, ఉస్మాన్, జావిద్, చోటా ఉస్మాన్, బాబా, నిజాం, రహీమ్, గౌస్ పయాజ్, విఠల్, శాన్వాజ్ ఉన్నారు. అలాగే, 23వ వార్డు నుంచి వీ రాజు, సునీత, పీ శంకర్, పీ మరియ, బీ ఎల్లమ్మ, నర్సమ్మ, సైసు సుమలత, పైసు యాకూబ్, కే నర్సయ్య, కే హేమలత, జీ నాగేంద్రబాబు, బోసు రాజు, జీ అనిల్, పీ మహేశ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ గౌడ్, మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజు, గోనె యువరాజు, ఎస్కే ఇర్ఫాన్, అఫ్జల్‌పాషా, ఎండీ బాబా తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT HANAMKONDA**

O.S.No. 5050 of 2022

Between :
A.P. Grameena Vikas Bank, DPO Branch, Hanamkonda, Reptd. by its Chief Manager ...Plaintiff
And
Pillalamarri Rajendra Prasad ...Defendant

To
Pillalamarri Rajendra Prasad, S/o: Venkataiah, Age: 50 years, Occ: Business, R/o H.No. 17-4-155, Main Road, Kareemabad, Warangal.

Please take notice that the above plaintiff filed the suit for the recovery of money against you. The said suit is posted on 30-10-2023 for your appearance. Hence, please take summons that you have to appear in the above suit either in person or through an Advocate on 30-10-2023 at 10.30 a.m before the above mentioned Hon'ble court without fail. If you fail to appear on the said date and time, the matter will be decided exparte.

(By the order of the Hon'ble court)

Sd/- **GUNDA MUKTEESHWAR RAO, Moluguri Raju,** Advocates,
H.No.8-3-72, old beet bazaar, Warangal - 506002. Mobile:9849391736

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- బీఆర్ఎస్ గెలుపునకు కలిసికట్టుగా కృషి చేయాలి
- ఎమ్మెల్యే అరూరి రమేశ్



నయీంనగర్: బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

నయీంనగర్, అక్టోబర్ 19: ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ 44వ డివిజన్ అమ్మవారిపేట నుంచి బీజేపీకి చెందిన పలువురు హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని అరూరి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, మొగిలి, కుమార్, శివ, పున్నం పాల్గొన్నారు.

**గెలుపే లక్ష్యంగా పని చేయాలి**

కరీమాబాద్: బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్యే అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. మామునూరులో 43వ డివిజన్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వివరించాలన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి ఓటరును కలిసి కారుగుర్తుకు పడేలా చూడాలన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు. అనంతరం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు.

**యువత క్రీడల్లో రాణించాలి**

కరీమాబాద్: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అరూరి అన్నారు. 43వ డివిజన్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడల్లో రాణించే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. తాను క్రీడాకారులకు అండగా ఉంటానన్నారు.



కమిటీ సభ్యులతో కలిసి చిన్నవడ్డేపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్

# దసరా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

కాశీబుగ్గ, అక్టోబర్ 19: వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోరారు. గురువారం ఆయన వరంగల్ 20వ డివిజన్ పద్మనగర్ సమీపంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఏటా వేడుకలు నిర్వహించేందుకు కాశీబుగ్గ దసరా ఉత్సవ కమిటీ పడుతున్న శ్రమ అనిర్వచనీయమన్నారు. దసరా వేడుకలను గతంలో ఓసిటీలో నిర్వహించే వారని, ఈ క్రమంలో కాలనీవాసుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేదన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు శాశ్వత పరిష్కారంగా చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఉత్సవాలకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకలను ఆడబిడ్డలు స్వేచ్ఛగా, సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో తాను వ్యక్తిగతంగా రూ. 40 లక్షలు వెచ్చించి మొరం పోయించి ఏర్పాట్లు చేసినట్లు గుర్తుచేశారు. రూ. 27 కోట్లతో చిన్నవడ్డేపల్లి బండ్ అభివృద్ధి జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ బండ్ సుందరీకరణతో పిల్లలకు ఆటస్థలంగా ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో బతుకమ్మ సంబురాలు

వరంగల్, అక్టోబర్ 19: (నమస్తే తెలంగాణ): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు బతుకమ్మలను తయారు చేసుకొని వచ్చి ఆవరణలో ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, డాక్టర్ మల్లేశ్వర్, మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య

**PUBLIC NOTICE**

Under the intructions of my client M/s. Shriram Finance Limited Warangal-II Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to Eroju Purna Chary S/o Dharma Chary Resident of Yellampet Village, Maripeda Mandal by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agree-ments, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 05 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Open plot No. 5 in Sy.No. 252 (Old), 252/B (New) to an extent of 206.66 Sq.yds or 172.78 Sq.mts situated at Kazipet Jagir Village, Hanamkonda Mandal of Warangal District within the limits of GWMC, Warangal and SRO Warangal RO is bounded by East: 30fts Road, West: Land of G. Suman Reddy, North: Plot No.4, South: Plot No.6.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

**PUBLIC NOTICE**

Under the intructions of my client M/s. Shriram Finance Limited Warangal-II Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to Kautheti Ravikanth S/o Vishwanath Resident of L.B Nagar, Warangal by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agree-ments, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 05 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

**Item No.1 :** Open plot No.1 in Sy.No 328 to an extent of 161.00 Sq.yds or 134.61 Sq.mts situated at Machapoor village, Geesugonda Mandal of Warangal District within the limits of Grampanchayath Machapur village and SRO Warangal Rural is bounded by East: 18fts wide Road, West: Land of Balakrishna, North: Land of K. Yadagiri, South: Plot No.2 of K. Vishwanath.

**Item No.2 :** Open plot No.6 in Sy.No 328 to an extent of 169.00 Sq.yds or 141.30 Sq.mts situated at Machapoor village, Geesugonda Mandal of Warangal District within the limits of Grampanchayath Machapur village and SRO Warangal Rural is bounded by East: 18fts wide Road, West: Land of T. Balakrishna, North: Plot No.5, South: Land of M.Chandraiah.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

**PUBLIC NOTICE**

Under the intructions of my client M/s. Shriram Finance Limited Warangal-II Branch. I issue the following notice to general public. My client intends to grant Loan to Yelthuri Radha W/o Yelthuri Dilip Resident of H.No. 13-79/2, Near Police Station Thorrur by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes, Mortgages, Sale Agree-ments, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 05 Days from the date of this notice. Other wise later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

The open plot No. 34, in Sy.No. 77/A/1, 77/A3, (77/A/3) and 77/B2 (77/B/2) and admeasuring to 200.00 Sq.yds or 167.22 Sq.mts situated at Gadepalli Village, Khila (Fort) Warangal mandal (Previously is was in Sangem Mandal) Warangal City & District (Urban) within the limits of Grampachayath Gadepalli Village and SRO Warangal Fort is bounded by East: Open plot No. 43, 42 & 41, West: 30.00 Fts Wide Road, North: Open plot No. 35, South: Open plot No. 33

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES,
H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HANAMKONDA, Warangal. Cell: 9849365117

**PUBLIC NOTICE**

It is hereby bring to the Notice of the Public that my client Dr. Talla Ravi had filed a suit for recovery of money against Mohammad Javid and Haji Mohammad Azeemuddin vide O.S.No. 31 of 2023 and also filed application for attachment of the below mentioned Schedule property vide I.A.No. 771 of 2023 before the Hon'ble Principal District Judge at Warangal which is pending.

So, It is hereby bring to the notice and caution to the General Public that any transactions of sale, mortgage, loan or any kind of alienation with third parties with regard to the below mentioned schedule property will be void and prone to litigation and the third parties are liable for all the legal consequences arising thereon.

**SCHEDULE OF THE PROPERTY**

All that property bearing Municipal H.No. 2-5-655 & 666 measuring about 3191 Sq.Yds known as ROYAL GARDENS, Near Paradise Hotel, Subedari, Hanumakonda which is bounded by following boundaries. East : Road, West : H.No. 2-5-682 of others, North : Open place of Thirumal Reddy, South : Road.

Sd/- **V. RAJA KARUNAKAR RAO**
Advocate
H.No. 1-7-720, Shanthinagar, Subedari, Hanumakonda.
Cell: 9391174332